ఖరారైన కల్కి రాక

'కల్కి 2898' ప్రపంచాన్ని చూసేందుకు ప్రేక్షకలోకమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. వైజయంతీ సంస్థ భారీ నిర్మాణ విలువలు, దర్శకుడు నాగ్‌అశ్విన్ దర్శకత్వ ప్రతిభ, ప్రభాస్ పాన్ ఇండియా ఇమేజ్.. ఇంకా సూపర్‌స్టార్లయిన అమితాబ్, కమల్‌హాసన్ భాగం కావడం ఇవన్నీ 'కల్కి 2898'పై అంచనాలు అంబరాన్ని తాకేలా చేశాయి. సైన్స్, మైథాలజీని మిళితం చేసి, ఓ వినూత్నమైన ఆలోచనతో నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా ఉత్కంఠ నెలకొని ఉంది. దానికి తెర దించుతూ విడుదల తేదీని మేకర్స్ శనివారం ప్రకటించారు. జూన్ 27న 'కల్కి 2898' విడుదల కానుంది. దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో దిశా పటాని కూడా భాగం అయ్యింది. దుల్కర్ సల్మాన్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఇటీవలే ద్రోణసుతుడైన అశ్వద్ధామగా అమితాబ్ బచ్చన్‌ని పరిచయం చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను వేరే లోకానికి తీసుకెళ్లింది. త్వరలో మరిన్ని అద్భుతాలను చూస్తారని మేకర్స్ తెలిపారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పాన్ వరల్డ్ స్థాయిలో నిర్మాత సి.అశ్వనీదత్ ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

నెట్టింట ప్రత్యక్షమైన సీతారాములు

రణ్‌బీర్ రాముడిగా ఎలా ఉంటాడు? సీతామహాసాధ్విగా సాయిపల్లవి నప్పుతుందా?.. నితేశ్ తివారి 'రామాయణ్' ప్రకటించిన నాటి నుంచీ ప్రేక్షకుల్లో తలెత్తున్న ప్రశ్నలివి. వాటికి సమాధానాలు దొరికేశాయి. ఇటీవలే షూటింగ్ మొదలైన ఈ సినిమాకు సంబంధించిన స్టిల్స్ సామాజిక మాధ్యమాల్లో అనుకోకుండా ప్రత్యక్షమయ్యాయి. వాటిని చూసి నెటిజన్లు సంబరపడిపోతుంటే.. సినీవర్గాలు మాత్రం ఆశ్చర్యపోతున్నాయి. అధికార ప్రకటన రాకుండానే ఏకంగా ఫోటోలు లీకవడంపై 'రామాయణ్' చిత్ర యూనిట్ విస్మయానికి లోనైంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫొటోలు లీకు కావడంతో చిత్రయూనిట్ తలలు పట్టుకున్నారు. దాంతో లొకేషన్లో ఆంక్షలు కఠినతరం చేశారట. ఇక ఫొటోల విషయానికొస్తే సీతారాములుగా రణ్‌బీర్, సాయిపల్లవి అద్భుతంగా కుదిరారు. ఆయోధ్య నగరశోభ, అంతఃపురాలు, వాటిమధ్య సీతారాములుగా నడిచివస్తున్న రణ్‌బీర్, సాయిపల్లవిలను చూస్తుంటే రెండు కళ్లూ చాలడంలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సీతమ్మగా సాయిపల్లవిని చూస్తుంటే ఎంత ముచ్చటగా ఉందో.. మూడు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ రామాయణంలో రావణుడిగా 'కేజీఎఫ్' ఫేం యష్ నటిస్తున్న విషయం తెలిసిందే. మండోదరిగా రకుల్, లక్ష్మణుడిగా నవీన్ పోలిశెట్టి కనిపించనున్నట్టు సమాచారం. బాలకాండ, అయోధ్యకాండ తొలి భాగంలోనూ, అరణ్యకాండ, కిష్కిందకాండ రెండో భాగంలోనూ, యుద్ధకాండ మూడో భాగంలోనూ నితేశ్ తెరకెక్కించనున్నారని తెలిసింది. వచ్చే ఏడాది దీపావళికి తొలి పార్ట్ విడుదల కానుందట.

నా కెరీర్‌ని మలుపు తిప్పే సినిమా

'టీజర్‌లో చూసింది ఒక్క శాతమే. ఈ సినిమా మీ అంచనాలను మించేలా ఉంటుంది. ఇది నేను చాలా కష్టపడి చేసిన సినిమా. ఒక్కటి మాత్రం నిజాయతీగా చెప్పగలను. ఈ సినిమా తర్వాత గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి ముందు గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి తర్వాత అనేలా నా కెరీర్ ఉంటుంది.' అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడు రూపొందుతోన్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణచైతన్య దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. శనివారం హైదరాబాద్లో ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వక్‌సేన్ మాట్లాడారు. మంచి సినిమా తీశామని దర్శకుడు నమ్మకం వ్యక్తం చేశారు. విశ్వక్ నటించిన పక్కా మాస్ మసాలా సినిమా ఇదని, మే 17న సినిమా విడుదల చేయనున్నామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ సినిమా తర్వాత తనను అందరూ బుజ్జీ అని పిలుస్తారని నేహాశెట్టి తెలిపారు. ఇందులో రత్నమాల అనే అద్భుతమైన పాత్రను పోషించానని, ఈ టీమ్‌తో పనిచేయడం ఆనందంగా ఉందని అంజలి అన్నారు. ఇంకా చిత్రయూనిట్ మొత్తం మాట్లాడారు.

ఒక్క కరెక్షన్ కూడా చేప్పలేకపోయా -సుకుమార్

'సుహాస్ అంటే నాకూ, బన్నీకీ చాలా ఇష్టం. 'పుష్ప'లో హీరో ఫ్రెండ్ కేశవ కేరక్టర్‌కి ముందు సుహాస్‌నే అనుకున్నాం. కానీ అప్పటికే తను హీరో అయిపోయాడు. దాతో కుదర్లేదు. హీరో నానిలా సుహాస్ కూడా సహజ నటుడు. భవిష్యత్తులో తను కూడా నాని అంత ఎదుగుతాడనిపిస్తుంది.' అని అగ్ర దర్శకుడు సుకుమార్ అన్నారు. సుహాస్ హీరోగా రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ కథానాయికలు. అర్జున్ వై.కె దర్శకుడు. జేఎస్ మణికంత, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ ఈవెంట్ కలిపి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సుకుమార్ ఇంకా మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను. ఏ కరక్షన్ చెప్పలేకపోయాను. అంత చక్కగా తీశాడు దర్శకుడు అర్జున్. 'జగడం' టైమ్‌లో తను నన్ను కలిశాడు. నా దగ్గర పనిచేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. నా టీమ్‌లోకి తీసుకున్నాను. కలిసి పనిచేశాక అతని పనితనం తెలిసింది. '100 పర్సంట్ లవ్' సినిమా కథను అతనితోనే కలిసి 23రోజుల్లో రాశాను. లాజిక్ తెలిసిన దర్శకుడు తను. హాలీవుడ్‌లో ఉండివుంటే మరోస్థాయి సినిమా తీసేవాడు. ఈ సినిమా కూడా అద్భుతంగా తీశాడు. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు సుకుమార్. తన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుందని, ప్రేక్షకులు థియేటర్ల దాకా వస్తే చాలు.. మిగతాది మేం చూసుకుంటామనీ, కచ్చితంగా సినిమా అందరినీ నచ్చుతుందని హీరో సుహాస్ అన్నారు. 'నిర్మాతల సహకారంతో సినిమాను అనుకున్నదానికంటే గ్రాండ్‌గా చేశాం. సహకరించిన అందరికీ ధన్యవాదాలు' అని దర్శకుడు చెప్పారు. ఇంకా అతిథులుగా విచ్చేసిన దర్శకులు బుచ్చిబాబు సాన, కార్తీక్ దండులతో పాటు నటుడు అవసరాల శ్రీనివాస్, కథానాయికలు రాశీసింగ్, పాయిల్ రాధాకృష్ణ, నిర్మాత మణికంత, ప్రసాదరెడ్డి కూడా మాట్లాడారు.

వేలాయుధంతో వేటాడుతాడు

1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న పీరియాడికల్ ఫిల్మ్ 'హరోంహర'. సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సూపర్‌స్టార్ కృష్ణ జయంతి రోజైన మే 31న విడుదల చేయనున్నట్టు మేకర్స్ శనివారం ప్రకటించారు. మాళవిక శర్మ ఇందులో కథానాయిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి.నాయుడు ఈ యాక్షన్ థ్రిల్లర్‌ని నిర్మిస్తున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సుధీర్‌బాబు వేలాయుధం పట్టుకుని మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. చిత్తూరు జిల్లా నేపథ్యానికి చెందిన సినిమా కావడంతో అక్కడి స్లాంగ్‌ని ప్రాక్టీస్ చేసి, ఇందులో నటించారు సుధీర్. తప్పక విజయం సాధించే సినిమా ఇదని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. సునీల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: చైతన్ భరద్వాజ్.

బాక్‌తో భయపెడతా

సుందర్.సి స్వీయ దర్శకత్వంలో నటించిన హారర్ కామెడీ సిరీస్ 'అరణ్మనై' నుండి వస్తున్న నాల్గవ చిత్రం 'అరణ్మనై 4'. తెలుగులో 'బాక్' పేరుతో మే 3న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. తమన్నా, రాశిఖాన్నా కథానాయికలు. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని యు/ఏ సర్టిఫికెట్‌ని పొందింది. మే 3న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్, పాటలకు మంచి స్పందన వస్తున్నదని, సినిమా కూడా తప్పకుండా అలరిస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్‌కుమార్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఇ. కృష్ణమూర్తి అకా కిచ్చ, సంగీతం: హిప్హాప్ తమిళా.

సిద్ధిగా ఆకట్టుకుంటా..

'ఇందులో నా పాత్ర పేరు సిద్ధి. స్వేచ్ఛగా బతకాలని కోరుకునే అమ్మాయిని. హీరో కేరక్టర్‌కి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర. ఈ రెండు పాత్రలు కలిస్తే ఎలా ఉంటుందనేది ఇందులో గమ్మత్తైన అంశం. ఈ పెళ్లి చుట్టూ తిరిగే కథ.. అందరికీ నచ్చేలా ఉంటుంది.' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. అల్లరి నరేశ్‌తో ఆమె జతకట్టిన సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. రాజీవ్ చిలక నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మీడియాతో ముచ్చటించింది. ' సిద్ధి కూడా నాలాంటి అమ్మాయే. బయట నేను సిద్ధిలాగే ఉంటాను. అందుకే చేయడానికి పెద్ద కష్టపడలేదు. ఇందులో కామెడీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. పరిస్థితుల నుంచే హాస్యం పుడుతుంది. ఇందులోని కంటెంట్ ప్రేక్షకులని సహజంగానే నవ్విస్తుంది.' అని చెప్పారు ఫరియా అబ్దుల్లా. అల్లరి నరేశ్‌తో పని చేయడం అద్భుతమైన అనుభవం అనీ, తన కామెడీ టైమింగ్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుందని, ఈ సినిమాలో ఆయన కడుపుబ్బ నవ్విస్తారని ఫరియా నమ్మకంగా చెప్పారు. 'దర్శకుడు మల్లీ తనకు బౌండ్ స్క్రిప్ట్ ఇచ్చారు. కథ గురించి అందరితో చర్చిస్తారు. అందరి సలహాలు తీసుకుంటారు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. ఆయన వర్కింగ్ స్టైల్ నాకు నచ్చింది' అని తెలిపారు ఫరియా. 'ఒకప్పటికీ ఇప్పటికీ పెళ్లి విషయంలో చాలా మార్పులొచ్చాయి. జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో అందరూ కచ్చితంగా ఉంటున్నారు. మ్యాట్రిమోనీ సైట్స్‌ను ఆశ్రయిస్తూ, ఒకరి గురించి ఒకరికి తెలియకుండానే ఒకటైపోతున్నారు. ఇలాంటి అంశాలతోపాటు పెళ్లికి సంబంధించిన అనేక అంశాలు కూడా ఇందులో ఉంటాయి.' అని ఫరియా తెలిపారు. ఎక్కడా రాజీ పడకుండా పేషన్‌తో నిర్మాత రాజీవ్ చిలక ఈ చిత్రాన్ని నిర్మించారని, అలాంటి మంచి నిర్మాత ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఆనందంగా ఉందని ఫరియా అన్నారు. 'మత్తు వదలరా 2', గోపీ దర్శకత్వంలో 'భగవంతుడు' సినిమాలతోపాటు ఓ తమిళ సినిమా కూడా చేస్తున్నట్టు ఫరియా తెలిపారు.

కష్టానికి తగ్గ ఫలితం

రవివర్మ, సంజనాసింగ్, ఆలోక్‌జైన్, మనీషా దేవ్, జీవ, విజయ రంగరాజు, సంధ్యశ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకుడు. ఎం.సి.రావు, జి.గోపాల్, ఎం.వి.మల్లిఖార్జునరావు, కోనూరి సుబ్రహ్మణ్యం, మణి నిర్మాతలు. మార్చి 8న విడుదలైన ఈ సినిమా 50రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 50రోజుల వేడుకను నిర్వహించారు. దర్శకుడు సముద్ర, నిర్మాత శోభారాణి అతిథులుగా హాజరై చిత్రయూనిట్‌కు అభినందనలు అందించారు. సక్సెస్ చేసిన అందరికీ పేరుపేరున ధన్యవాదాలని హీరో రవివర్మ అన్నారు. మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోమారు రుజువైందని దర్శకుడు ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు చౌడప్ప పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని నిర్మాతలు అన్నారు. ఇంకా చిత్రయూనిట్ అంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రేమికుడు మళ్లీ వస్తున్నాడు

ఎస్.శంకర్ దర్శకత్వంలో ప్రభుదేవా హీరోగా 30ఏళ్ల క్రితం విడుదలైన 'ప్రేమికుడు' సినిమా ఓ సంచలనం. యువతని ఉర్రూతలూగించిన సినిమా ఇది. శంకర్ దర్శకత్వ ప్రౌఢి, ప్రభుదేవ డాన్సులు, నగ్మ అందచందాలు, నిర్మాత కేటీ కుంజుమన్ భారీ నిర్మాణ విలువలు అన్నింటినీ మించి ఏఆర్ రెహమాన్ స్వరాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. విశేషమేంటంటే.. మే 1న మళ్లీ 'ప్రేమికుడు' థియేటర్లలోకి రానున్నాడు. నేటి యువతని కూడా టార్గెట్ చేయనున్నాడు. రమణ, మురళీధర్ ఈ రీరిలీజ్‌కు నిర్మాతలు. మే 1న 300లకు పైగా థియేటర్‌లలో ఘనంగా 'ప్రేమికుడు'ని విడుదల చేయనున్నట్టు నిర్మాతలు తెలిపారు. బుకింగ్స్ ఓపెన్ అవ్వడంతో ప్రజలనుండి అద్భుతమైన స్పందన వస్తున్నదని, ఈ సినిమా థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసం నేటి యువత కూడా ఎదురు చూస్తున్నదని వారు అన్నారు. ఇంకా నిర్మాత శోభారాణి కూడా మాట్లాడారు. ఎస్పీబాలసుబ్రహ్మణ్యం, గిరీశ్‌కర్నాడ్, వడివేలు, రఘువరన్ ఇందులో కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే.

నాతోపాటు ఇంట్లో ఉంటున్నది దెయ్యమా?

'ది కేరళా స్టోరీ'తో నటిగా గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించింది అదాశర్మ. హారర్, యాక్షన్, ఎమోషన్.. ఇలా అన్ని రకాల కాన్సెప్ట్‌లతో దూసుకుపోతున్న ఈ అందాలభామ కొంత విరామం తర్వాత నేరుగా తెలుగులో చేస్తున్న సినిమా 'సీడీ'. 'క్రిమినల్ ఆర్ డెవిల్' అనేది ఉపశీర్షిక. ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీకి కృష్ణ అన్నం దర్శకుడు. ఎస్ఎస్‌సీఎం ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న ఈ చిత్రం మే 10న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'చీకటి వెలుతురు మధ్య కనిపించని శత్రువు ఎవరో ఉన్నారు. ఎవరు చేస్తున్నారు ఇదంతా?.. నా చుట్టూ ఏదో జరుగుతోంది. నాతోపాటు ఇంట్లో ఉంటోంది దెయ్యమా? మరణంతోపాటు యుద్ధం తప్పదా? నన్ను చంపడానికి వచ్చింది ఎవరు? క్రిమినల్ ఆర్ డెవిల్..' అంటూ హీరో విశ్వంత్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ సాగింది. అదాశర్మ యాక్షన్ సీక్వెన్స్, భయపెట్టే చూపులు.. ఇది హారర్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్ అని చెప్పకనే చెబుతున్నవి. విశ్వంత్, జబర్దస్త్ రోహిణి, భరణి శంకర్, రమణ భార్గవ్, మహేశ్ విట్టా ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: ముద్దుకృష్ణ, కెమెరా: ముత్యాల సతీశ్, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.